International Journal of Multidisciplinary Trends

E-ISSN: 2709-9369
P-ISSN: 2709-9350
www.multisubjectjournal.com
IJMT 2023; 5(5): 62-68
Received: 01-03-2023
Accepted: 05-04-2023

డా॥ వి. నారాయణప్ప
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు,
మరియు సాహిత్య
అధ్యయన శాఖ, ఢిల్లీ
విశ్వవిద్యాలయం, ఢిల్లీ,
ఇండియా

Corresponding Author:
డా॥ వి. నారాయణప్ప
అసోసియేట్ ప్రొఫెసర్,
ఆధునిక భారతీయ భాషలు,
మరియు సాహిత్య
అధ్యయన శాఖ, ఢిల్లీ
విశ్వవిద్యాలయం, ఢిల్లీ,
ఇండియా

# నన్నయ అక్షర రమ్యత

## డా॥ వి. నారాయణప్ప

**అమూర్త**

తెలుగు సాహిత్యము నన్నయ భారతానువాదముతోనే ప్రారంభమయినది. నన్నయ తెలుగులో ఆదికవి. అతనిలో భారత రచనకు కావలసిన మహోన్నత సుగుణములు ఉన్నాయి. ఇందులో భారతాంధ్రీకరణకు హేతువులు, నన్నయ భారతాంధ్రీకరణములో అనుసరించిన పద్ధతులు, తాను ఇమిడ్చిన గుణములు ప్రధానంగా తన రచనలో పాటించిన అక్షర రమ్యత ఎటువంటిదో ఇక్కడ చర్చించడము జరిగినది.

**కీలక పదాలు:** కథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, సూక్తి నిధిత్వము, కురువృద్ధుల్, ప్రకర్షణ, ఆకర్షణ, అనుకర్ష, వికర్షణ, ఆచకర్షతు, దోర్దండ, బ్రహ్మాండ, భాండంబు, దండధర, చండక్షోభ, శయ్య.

## 1. కవి పరిచయము

కవిత్రయములో మొదటివాడగు నన్నయ 11వ శతాబ్దమున రాజమహేంద్రవరమును రాజధానిగా చేసికొని పాలించిన తూర్పు చాళుక్యరాజు రాజరాజనరేంద్రుని ఆస్థాన కవి. ఈయన రాజరాజ నరేంద్రునకు 'కుల బ్రాహ్మణుడు' అనగా కుల గురువు, పురోహితుడు. ఈతని ముఖ్య గ్రంథము శ్రీమదాంధ్ర మహాభారతమునందలి మొదటి రెండున్నర పర్వములు (ఆది పర్వము, సభా పర్వము, అరణ్య పర్వములో నాల్గవ ఆశ్వాసములో 142వ పద్యము వఱకును రచించెను). 'చాముండివిలాసము', 'ఆంధ్ర శబ్ద చింతామణి', 'ఇంద్ర విజయము', 'లక్షణ సారము' అనునవి ఇతని ఇతర కృతులు. ఇతనికి 'ఆది కవి', 'వాగనుశాసనుడు' అను బిరుదములు కలవు. నారాయభట్టు, పావులూరి మల్లన మొదలగువారు నన్నయ సమకాలికులు.

## 2. నన్నయ వ్యక్తిత్వము

నన్నయ 'అవిరళ జపహోమ తత్పరుడు, విపుల శబ్ద శాసనుడు, సంహితాభ్యాసుడు,

బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుడు, సద్వినుతావదాత చరిత్రుడు, లోకజ్ఞుడు, ఉభయ భాషాకావ్య రచనాభిశోభితుడు, సత్ప్రతిభాభియోగ్యుడు, నిత్య సత్యవచనుడు, మత్య మరాధిపాచార్యుడు, సుజనుడు'. ఇంతటి మహోన్నతములైన సుగుణములు నన్నయలో ఉన్నందువలననే అతడు భారత రచనకు అర్హుడయ్యెను.

### 3. భారతాంధ్రీకరణకు హేతువు

రాజరాజనరేంద్రుని పట్టాభిషేకము క్రీ.శ.1022 ఆగస్టు 22వ తేది నాడు జరిగినది. రాజరాజు శివభక్తుడు, కవిపోషకుడు, సుందరుడు, భారత శ్రవణాసక్తుడు.

రాజరాజు సంస్కృత వ్యాస భారతమును ఆంధ్రీకరించుటలో నన్నయకు ప్రోత్సాహిమిచ్చుటకు కారణమే మనగా అతడు పాండవుల వంశమువాడగుటయే. కావున అతడు తచ్చరిత్రముగల భారతమును వినుటకు ఇష్టపడుచుండును. అంతేకాదు భారతమును విన్నచో వేదములను పఠించు బ్రాహ్మణులకు, సువర్ణదానము, గోదానము చేసినంత ఫలితము సమకూరును. అదియునుగాక అంతకు ముందే, క్రీ.శ.7,8 శతాబ్దముల కాలముననే పెరిందేవనారను కవి అరవమున భారతమును వెంబా అను దేశియచ్ఛందమున రచించియుండెను. కన్నడమున పంపమహాకవి భారతకథనే 'విక్రమార్జున విజయ' మను పేర చంపూకావ్యముగ కన్నడించియుండెను. తెలుగుకింకను ఆ గౌరవము కలుగకుండట రాజరాజునకొక కొఱతగా అనిపించి యుండును. అందుచేత అతడు-

"జననుత! కృష్ణద్వైపా
యన ముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడ
దెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్"

అని భారతాంధ్రీకరణమునకు నన్నయను ప్రోత్సహించెను. నన్నయ భారతాంధ్రీకరణకు అంగీకరించి "విద్వజ్జనంబుల యనుగ్రహంబునం జేసి నానేర్చు విధంబున నిక్కావ్యంబు రచియించెద" నని నన్నయ సవినయముగా చెప్పినాడు.

నన్నయ శ్రీమదాంధ్రమహాభారతమునకు "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ" అను సంస్కృత శ్లోకముతో శ్రీకారము చుట్టినాడు. అరణ్య పర్వ చతుర్థాశ్వాసమునందలి 142 వదియగు "శారద రాత్రు" లను పద్యముతో నన్నయ గంటము ఆగిపోయినది.

### 4. నన్నయ భారతాంధ్రీకరణములో అనుసరించిన పద్ధతులు

నన్నయ భారతాంధ్రీకరణములో అనుసరించిన పద్ధతులు ముఖ్యముగా ఆరు. అవి వరుసగా
1. యథామూలకత, 2. మూలకుంచనము,
3. మూలప్రపంచనము, 4. అన్యథా ప్రకల్పనము,
5. మూలత్యాగము, 6. అమూలకత. నన్నయ విడిచిన మూల రమ్యత కూడ పరిశీలనార్హమైనది.

పునరావృత్తములను నిర్మూలించి, అనౌచిత్యమును త్యజించి, ఔచిత్యమును పోషించుట కొఱకే నన్నయ ఈ పద్ధతులను అనుసరించి యుండును.

### 5. నన్నయ భారత రచనలో ఇమిడ్చిన గుణములు

నన్నయ తన రచనలోని గుణములను తానే ఈ క్రింది పద్యమున చెప్పియున్నాడు.

సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తి
లో

నారసి మేలు నా, నితరు లక్షరరమ్యత నాదరింప, నా
నా రుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురు డయ్యె జగద్ధితంబుగన్"
(ఆది, 1-24)

నన్నయ కవితా గుణములలో మొదటిది ప్రసన్న కథాకలితార్థయుక్తి, ఇది కావ్య అంత్స్వరూపము. దీనిని 'సారమతి'తో 'కవీంద్రులు'లో నారసి తెలియునట్టిది. రెండవది అక్షర రమ్యత. ఇది కావ్య బహిస్స్వరూపము. కవీంద్రులు కాని వారు కూడ ఆదరించునట్టిది. మూడవది నానారుచిరార్థ సూక్తి నిధిత్వము.

ఇందు రెండవదియగు అక్షర రమ్యత నా వ్యాసమునందలి చర్చనీయాంశము. కనుక అక్షర రమ్యత బహిస్స్వరూపమేమియో పరిశీలింతము.

నన్నయ ప్రసన్న కథా కలితార్థయుక్తితో అర్థసిద్ధిని, అక్షర రమ్యతతో శబ్ద సిద్ధిని సాధించినాడు. అక్షర రమ్యత అనగా అక్షరముల వలన పుట్టిన రమ్యత. ఈ రమ్యత శ్రవణేంద్రియైక వేద్యము. దీనిని ఆదరించుటకు పెద్దగా బుద్ధి నైశిత్యము అక్కరలేదు. అక్షర రమ్యతకు ప్రధానమైనది నాద సౌష్ఠవము. అది నన్నయ శయ్యలో సర్వవ్యాప్తియై యున్నది.

## 5.1. నన్నయ శబ్ద శిల్పము

నన్నయ చేసిన నాగస్తుతి-

"బహువన పాద పాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీధర మజస్ర సహస్ర ఫణాళి దాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికి బాయక శయ్యయైన య
య్యహిపతి దుష్కృతాంతకుడ నంతడు మాకు బ్రసన్నుడయ్యెడున్"
(ఆది. 1-24)

'సరస్సరస్వతీ సహిత ` దుస్సహతర' అని 'స' వర్ణమును పలుమారు ఆవృత్తి చేయుటచే పాముల బుస్సుమను ధ్వని వినిపించుచున్నది. 'పాయక శయ్యయైన యయ్యహిపతి' అనుటలోని 'య' కారాసకృదావృత్తివలన అనంత శయ్యామార్దవము సూచింపబడినది.

**నన్నయ చేసిన సముద్ర వర్ణనను చూడుడు:**

"వివిధోత్తుంగ తరంగ ఘట్టన చలద్వేలా వనైలావలీ
లవలీ లుంగ లవంగ సంగత లతా లాస్యంబు లీక్షించుచున్"
(ఆది. 2-29)

సముద్ర తరంగముల చలన మిచట సూచింపబడినది. కెరటము మిక్కిలి ఎత్తుగా లేచి, మెల్లగా నించుక సాగి, ఒడ్డునకు కొట్టుకొని జలజలమను ధ్వనిని చేయును. ఇది యంతయు ఈ సమాసమున నిక్షేపింపబడినది. 'వివిధోత్తుంగ' అనుటలో కెరటము ఔన్నత్యము, 'తరంగ' అను దానిచే అది ఇంచుక సాగుటయు, 'ఘట్టన' అను దానిచే అది ఒడ్డునకు కొట్టుకొనుటయు, 'చలద్వేలా, వనైలావలీ, లవలీ, లుంగ, లవంగ, సంగత, లతా లాస్యంబు లీక్షించుచున్' అను దానియందలి 'ల'కార బాహుళ్యము వలన దాని జలజల ధ్వనియు లెస్సగా సూచింపబడినది. అంతియేగాక ఆ లతాలాస్యములు కూడ కన్నులకు కట్టుచున్నవి.

"కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవు లనేకుల్ సూచుచుండన్ మదో
ద్ధరుడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోక భీ
కర లీలన్ వధియించి తద్విపులవక్షశ్శైల రక్తౌఘు ని
ర్ఝర ముర్వీపతి సూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్"
(సభా. 2-233)

ఇందలి ద్విత్వ ధకార ప్రాచుర్యముచే భావి యుద్ధమున భీముడు దుశ్శాసనునకు ఈయనున్న పిడిగ్రుద్దులు సూచింపబడినవి.

"ఘోర వనమున వీరు గిమ్మీరు డను సు
రారి నిశ్చల ఘన భీకరాంగు బట్టి
పోర వధియించినట్టి సమీరజునకు
భూరి భుజునకు మార్కొను వారు గలరె."
(అరణ్య. 1.102)

ఇందలి 'ర' కార పునరావృత్తి భీముని వీరత్వమును చక్కగా వ్యక్తము చేయుచున్నది. తేటగీతిలో కూడ నన్నయ ప్రాస సౌందర్యమును, గుంఫనముగా నున్న శబ్ద శిల్పమును వ్యక్తము చేసినాడు.

"సాగర సార వారిరుహ శౌక్తిక మౌక్తిక విద్రుమద్రుమై
లాగురు చందనంబులు ప్రియంబున నిచ్చిరి తెచ్చి యున్నత
శ్రీ గుణయుక్తిమై బరగు సింహళ కేరళ చోళ పాండ్య
దేశాగత రాజపుత్రులు మహాగుణశాలి కజాతవైరికిన్"
(సభా. 2-110)

"మందిత సూర్య రశ్మి రుచి మన్మణిహార చయంబుతో గట
స్యంది సుగంధి దానజల సంపద నొప్పెడు వాని దేవకీ
నందనుడిచ్చె బ్రీతి బదునాలుగువేల గజంబులన్ జనా
నందన కీర్తియైన యమనాథ తనూజున కిష్టమిత్రుడై"
(సభా. 2-111)

ఏదేని అర్థ విశేషముగాని, అలంకారముగాని, చమత్కారము గాని లేని పద్యములందు కూడ నన్నయ అక్షర రమ్యతను నిక్షేపించుటచే, అవి ఎనలేని యింపు సొంపులను సంపాదించుకొనుచున్నవి.

**ఈ క్రింది పద్యమును కూడ గమనింపుడు**

"భరతు డశేష భూభువన భారధురంధరుడై వసుంధరం
బరగి యనేక యాగముల బాయక భాస్కర జహ్ను కన్యకా
సురుచిర తీర దేశము సువ్రతుడై యొనరించి భూరి భూ
సురులకు నిచ్చె దక్షిణలు శుద్ధ సువర్ణ గవాశ్వ హస్తులన్."
(ఆది. 4-110)

ఈ పద్యము అక్షర రమ్యత కలది.

"భరతుడశేష భూ భువన భారత ధురంధరుడై వసుంధరం" భ-అనునక్షరము నాల్గుసార్లు, ర-అనునక్షరము నాల్గుసార్లు, ధు-ధ-మూడుసార్లు, ధురంధ - వసుంధ - బిందు పూర్వక ధ కారము రెండుసార్లు వచ్చుటచే పద్యము అందముగా నడచుచున్నది. భ - ర - ధ - బరువైన అక్షరములు కాబట్టి భరతుడు మోయుచున్న రాజ్యమంత బరువుగా నున్నదని కవి అక్షర రమ్యతచే సూచించెను. ఇందులకే భర(తుడు) (భూభువన) భారము - అని కవి యతి స్థానమున ప్రయోగించి స్పష్టము చేసెను.

కథను అందముగా అలంకరించుటయే 'ప్రసన్నకథా కలితార్థయుక్తి' అని కవి చెప్పినాడు. ఈ విషయమే పై పద్యము యొక్క వివరణమందు సూచింపబడినది.

పద్యములందే కాదు గద్యములందు కూడ నన్నయ అక్షర రమ్యతా ముద్ర కనవచ్చుచునే యుండును. ఈ క్రింది గద్యమును చూడుడు:

"ఇట్లు భగీరథుండు గంగావతరణంబునందు గృత నిశ్చయుండై యరిగి బహువిధాకార ధాతుమంతంబులైన యుత్తుంగ శృంగంబులను జలభర వినమ్ర ప్రబల బలాహక వ్యూహ సంఛాదిత శ్యామాయ మానంబులైన తుహినస్థలంబులను, సిద్ధ విద్యాధర గంధర్వ గీర్వాణ మిథున సంసేవ్యమానంబులైన నానారత్న కందరంబులను, శుక పిక పారావత శుక్లాపాంగ సారంగ శతపత్ర పుత్రప్రియ దాత్యూహవ్యూహ శబ్ద శబ్దాయ మానంబులైన తరువన రేఖలను, సింహ శరభ శార్దూల శుండాల గోలాంగూల కోలాహలాన్వితంబులైన గుహాగహ్వరంబులనుం జేసి

రమణీయ భయానకంబైన హిమవత్పర్వతంబున`"
(అరణ్య. 3-77)

ఈ అక్షర రమ్యతవలన నన్నయ యితరులాదరించు కేవల శ్రుతి సుభగత్వమునేగాక, యొక్కొకచో సారమతిం గవీంద్రులు లోనారసి మేలను ననిర్వాచ్యమయిన ఏదోనొక మహార్థమును కూడ స్ఫురింపజేయును.

ఇక వ్యాస నన్నయల అక్షర రమ్యత పోలిచి చూతము. వ్యాస భారతములో జరాసంధ భీమసేనుల మల్లయుద్ధము ఈ క్రింది విధముగా అభివర్ణింపబడినది. ఈ సందర్భమున వ్యాసుడు ప్రదర్శించిన అక్షర సన్నివేశము ప్రయత్న సిద్ధమా? అప్రయత్న సిద్ధమా? అను నచ్చెరువు కలిగించును.

"బలినో స్సంయుగే రాజన్ వృత్ర వాసవయో రివ
ప్రకర్షణా కర్షణాభ్యా మనుకర్ష వికర్షణైః
ఆచకర్షతు రన్యోన్యం జానుభి శ్చావజఘ్నతుః
తత శ్శబ్దేన మహతా భర్త్సయంతా పరస్పరమ్"
(వ్యా.భా. సంపు. 1, పు. 524)

'ప్రకర్షణ - ఆకర్షణ - అనుకర్ష - వికర్షణ - ఆచకర్షతు' మొదలగు శబ్దములలో 'ర' కార 'ష' కారముల సంయోగముతో గూడిన అక్షర సన్నివేశము ఉచ్చారణ మాత్రముననే శ్రుతి పౌరుష్యము కలిగింపక మానదు. మాధుర్య సౌకుమార్యములకు విముఖమై, భయానకమునకు అనుకూలమగు అక్షర సన్నివేశము రసవ్యంజకమగుచున్న సందర్భమిది.

భారతానువాద సమయమున అక్షర సన్నివేశ చారువులయిన యిట్టి సందర్భములలో నన్నయ జాగరూకుడై రచన సాగించెను. పై భీమసేన జరాసంధుల మల్లయుద్ధ ఘట్టమునందు తానును 'ర' కార 'ష' కారముల సంయోగముతో కూడిన శబ్దములనే ఆవృత్తము గావించెను.

"కర్షతరిపు లన్యోన్యా
కర్షణ సంకర్షణాపకర్షణముల సా
మర్షులయి పెనగి రాహవ
హర్షంబున బసవసుత బృహద్రథ పుత్రుల్"
(సభా. 1-204)

మూలమందలి అక్షర సన్నివేశము ననుకరించుటతో తనివి సనక, నన్నయ సన్నివేశమునకు దీప్తి యొదవించు 'ర' కార 'ష' కార సంయుక్తాక్షరమును ప్రాస స్థానమునందు నిలిపి పద్యమాద్యంతము శ్రుతివికర్తన ధ్వనిమయము గావించెను. అందును కంద పద్యమే యీ సందర్భమునకు వినియోగించుట మఱియు గుర్తింప దగినది.

**ఈ సందర్భమునందు మరియొక పద్యమును కూడ చూడుడు**

"సమసత్త్వాతిశయుల్ వృకోదర జరాసంధుల్ మహోద్యత్పరా
క్రమ మొప్పం గడు నల్గి యొండొరుల జుల్కందాకి రన్యోన్య దు
ర్దమ దోర్దండ పటు ప్రహార జనిత ధ్వానంబు బ్రహ్మాండ భాం
డము నిండన్ లయకాల దండధర చండక్షోభమో నా జనుల్"
(సభా. 1-203)

'దోర్దండ - బ్రహ్మాండ - భాండంబు - నిండన్ - దండధర - చండక్షోభ' - ఇందలి బిందు పూర్వక 'డ' కార ప్రయోగము గుర్తింపదగినది. తత్పునరావృత్తిచే నొదవెడు మహానిర్ఘోషము మల్లయుద్ధ భయానకత్వము సువ్యంజిత మగుచున్నది. వర్ణ సంఘటనాత్మకమగు అక్షర రమ్యతకిది నిదర్శనము. ఇట్లెన్ని యేని సొగసులు చూపవచ్చును.

మహాకవులలో శబ్దసిద్ధులు కొందఱు, అర్థసిద్ధులు కొందఱు. ఉభయ సిద్ధులు గూడ కొందఱు లేకపోలేదు.

కాని వారి సంఖ్య అత్యల్పము. అట్టి కొలది మంది ఉభయ సిద్ధులలో నన్నయ అగ్రగణ్యుడు. అతడు ప్రసన్న కథా కలితార్థయుక్తితో అర్థసిద్ధిని, అక్షర రమ్యతతో శబ్దసిద్ధిని ప్రతిజ్ఞ చేసి సాధించినాడు.

అక్షర రమ్యతలో సిద్ధివడయుటకు అపారమయిన పాండిత్యము, సునిశితమునైన శ్రుతి లయ జ్ఞానము కావలయును. ఇవి రెండును నన్నయ కడ పుష్కలముగా నున్నవి. అతడు విపుల శబ్ద శాసనుడనుట ఆంధ్ర శబ్ద చింతామణి రచన వలననే కాక, ఈ అక్షర రమ్యతను భారత రచనాంతము వరకు సాధించుట వలన కూడా నన్వర్థమగుచున్నదని చెప్పనొప్పును.

### 5.2. ఉభయ వాక్ప్రౌఢి

'భాషింతు నన్నయ భట్టు మార్గంబున నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు' అని కవిసార్వభౌముడగు శ్రీనాథుడు, 'విపుల శబ్దశాసను'డగు నన్నయభట్టు కవిత్వమును 'ఉభయ వాక్ప్రౌఢి'తో కూడినదని ప్రశంసించినాడు. శ్రీనాథుడు చెప్పిన ఆ ఆది కవి యొక్క ఉభయ వాక్ప్రౌఢి ఎట్టిదియో పరిశీలింతము.

నన్నయ రచనలో మూడు వంతులు సంస్కృత పదములును, ఒక వంతు తెలుగు పదములుననియు; తిక్కన రచనలో మూడు వంతులు తెలుగు పదములు, ఒక వంతు సంస్కృత పదములు ననియు ఎల్లరును స్థూలముగానను మాట. కాని సూక్ష్మముగా పరిశీలించినచో ఇరువురును రసానుగుణముగనే ఆ ఉభయ వాక్కులను ప్రయోగించి యుండిరని నోదాహరణముగా నిరూపింపవచ్చును.

అది యెట్లున్నను ఒక్కటి మాత్రము నిజము. నన్నయ సంస్కృతము తెలుగువలె నుండును. తిక్కన తెలుగు సంస్కృతమువలె నుండును. అనగా నన్నయ సంస్కృతము తెలుగువారి నిత్యవ్యవహారములోనుండి వారికి సుపరిచితమై సులభ భావబోధకముగ నుండుననియు; తిక్కన తెలుగు కూడ సంస్కృతమువలె కఠినమై ఆంధ్రుల వాగ్వ్యవహారాపరి క్షుణ్ణమై, యించుక దుర్గ్రహమై యుండుననియు భావము.

ఉదాహరణకు నన్నయ పద్యమును గమనింపుడు:

"శరమోక్షణ వేగనిరం
తర మండలితోరు చాపదండు డకాండో
ద్ధురదండధరుడు వోలెను
హరినందను దాకె ద్రుపదుడత్యుద్ధతుడై"
(ఆది. 6-85)

ఇది నన్నయ పద్యము. ఇందు 'వోలెను', 'తాకె' అను రెండు మాటలు తప్ప తక్కినవన్నియు సంస్కృత పదములే అయినను పద్యమేమంత కష్టముగా లేదనుట నిర్వివాదము. అట్లే తిక్కన పద్యము గమనింపుడు:

"నెగెయునెడ నగ్గమైనను
బిగియారుచు బిఱుదు సనిన బిడికిట గొఱసం
ది గడు బెడిదముగ బొడిచెం
బగతుడు గనుమిడిసి నేలబడి తన్నికొనన్"
(విరాట. 2-351)

ఇందొక్కటియైనను సంస్కృత పదము కానరాదు. అయినను నన్నయ సంస్కృత పదమయ పద్యమంత తేలికగా లేదనుటయు, అర్థమగుట కించుక తన్నుకొన వలసి యుండుటయు స్పష్టము.

నన్నయ పద్యమును దేనిని చూచినను ఈ సంస్కృత పదలాలిత్యము స్పష్టమగుచునే యుండును. అతని సమాసములు అతి లలితములు, చూడుడు:

"రాజకులైక భూషణుడు, రాజమనోహరు, డన్య రాజ తే
జోజయశాలి శౌర్యుడు, విశుద్ధ యశశ్శర దిందు చంద్రికా
రాజిత సర్వలోకు డపరాజితభూరిభుజాకృపాణ ధా
రాజల శాంత శాత్రవ పరాగుడు, రాజమహేంద్రుడున్నతిన్"
(ఆది. 1-3)

అతని సమాసలాలిత్యమునకు ఎన్నియేని పద్యములను ఉదాహరింపవచ్చును. తెలుగు పదముల లాలిత్యమునకు మఱియొక పద్యమును చూడుడు. దుష్యంత నిరాకృతయై శకుంతల విలపించు సందర్భములోనిది.

## మధ్యాక్కర

"తడయక పుట్టిన నాడ తల్లిచే దండ్రిచే విడువ
బడితి నిప్పుడు పతి చేతను విడువ బడియెద నొక్క,
నుడువులు పేయు నింకేల యిప్పాటి నోములు దొల్లి
కడగి నోచితిని గాకేమి యనుచును గంద డెందమున"
(ఆది. చ.103)

ఈమె విలాపములో ఒక్క 'పతి' శబ్దము దక్క తక్కినవన్నియు తెలుగు పదములే యగుట గమనింపదగినది. అంతేకాదు, ఈ మాటలను దేశీయ ఛందస్సయిన మధ్యాక్కరలో నిబంధించుటయు గమనింప దగినది. శోకాలాపములకు తెలుగే ఉచితమని నన్నయ తలచి యుండెనేమో. ఇది రసానుగుణమైన రచన.

## 6. ఉపసంహారము

భారతరచనకు శ్రీకారమును జుట్టినది మొదలు నన్నయ గంటమాగి పోవునంతవఱకు అక్షర రమ్యత అంతట ప్రత్యక్షమగుచున్నది. దానిని సాధించుటకు అతడవలంబించిన పద్ధతులివి అని నిర్దేశించి చెప్పుట కష్టము. ఏ శబ్దము తరువాత ఏ శబ్దమును పొందుపఱచిన అది సిద్ధించునో అతనికి సహజ పాండిత్యముగ అలవడియుండును.

నన్నయది కర్ణపేయమైన శైలి. నన్నయ పద్యము విన్నంతనే అర్థము తెలిసినను తెలియక పోయినను పాఠకుని చెవికి ఇంపునింపి హాయి గొల్పును. తత్సమపద భూయిష్ఠమైనను నన్నయ శైలియందు అర్థ కాఠిన్యము కాని శబ్ద పారుష్యముగాని ఉండదు. శబ్ద గాంభీర్యము వలన నన్నయ రచనకు ఉదాత్తత, ఠీవి లభించినవి. తొట్రుపాటుగాని, వేగిరపాటుగాని లేకుండ గంభీరముగ, సమాస విక్షేపములతో సాగిపోవు నన్నయ భారత పద్యముల నడకను బట్టియే ఎఱ్ఱన నన్నయను భద్రగజముతో పోల్చి ఈ క్రింది పద్యములో ఇట్లు చెప్పియున్నాడు, చూడుడు:

"ఉన్నత గోత్ర సంభవము నూర్జిత సత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్య పరిభావి మదోత్కటమున్ నరేంద్ర పూ
జోన్నయ నోచితంబునయి చొప్పడు నన్నయభట్ట కుంజరం
బెన్న నిరంకుశోక్తి గతి సెందును గ్రాలుట బ్రస్తుతించెదన్"
(హరివంశము, పీఠిక, 8వ పద్యము)

## 7. ఆధార గ్రంథములు


1. వ్యాస భారతము: నన్నయ పరిష్కారము. - డా.జొన్నలగడ్డ మృత్యుంజయరావు
2. తెలుగు సాహిత్య సమీక్ష (మొదటి సంపుటం) - డా.జి.నాగయ్య.
3. నన్నయ కవిత్వము: అక్షర రమ్యత – డా.వి.వి.యల్.నరసింహారావు.